క్లుప్తంగా

హరిద్రాదేవి అలంకరణలో దుర్గాభవానీమాత


దుర్గాభవాని మాత

సంగారెడ్డిటౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేట ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మాధికారి బ్రహ్మశ్రీ కమలంపేట రాధాకృష్ణ మూర్తి శర్మ తెలిపారు. సోమవారం నుంచి ప్రతి నిత్యం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తారు. మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం అమ్మవారు హరిద్రాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మునిపల్లి(అందోల్): అమావాస్యను పురస్కరించుకుని భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండలంలోని బుదేరా గ్రామ శివారు గుట్టపై వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

ఘనంగా నగర సంకీర్తన


ప్రవచనాలు వింటున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో ఆదివారం 173వ నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందిలోని హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కృష్ణభక్తి భావన మినహా సమస్త కలాపములను త్యజించువారే భగవంతుడికి అత్యంత ప్రీతి పాత్రులవుతారన్నారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు.

రేపు ఖేడ్‌లో భోగ్ భండార్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని రాంరావు మహరాజ్ ట్రస్టు మందిరం వద్ద ఈనెల 23 మంగళవారం భోగ్ భండార్, భవానీమాత దీక్షాధారులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ తెలిపారు. అఖిలభారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని భవానీమాత దీక్షాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్


కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లోని డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. అందుకు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి సమష్టిగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ అరుణ్‌కుమార్, సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు కృషి


హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేస్తున్న యువకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రం న్యాల్‌కల్‌లో నారాయణఖేడ్ వెళ్లే చౌరస్తా వద్ద రెండేళ్ల క్రితం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ లారీ ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయింది. దీంతో చౌరస్తా వద్ద చీకటి నెలకొంది. ఫలితంగా చౌరస్తా నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రాత్రి పూట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యువకులు విరిగిపోయిన స్థంభాన్ని తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

శివాజీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో?

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- నిరాశలో మండల క్రీడాకారులు


క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

జిన్నారం (పటాన్‌చెరు): క్రీడలంటే ఇష్టం ఉండని వారు ఉండరు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాలని ఉబలాటపడుతుంటారు. అందుకు అవసరమైన స్టేడియాలు లేకపోవడంతో నిరుత్సాహపడుతుంటారు. పట్టణ కేంద్రంలోని శివాజీ స్టేడియం నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదు. ఇది ఎప్పుడు అందుబాటులోకి వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఈ ప్రాంత క్రీడాకారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మినీ స్టేడియం నిర్మాణం..

జిన్నారం పట్టణ కేంద్ర సమీపంలోని సర్వే నంబర్ 1002లో మినీ స్టేడియం నిర్మాణానికి ఐదు ఎకరాల కేటాయించారు. మండల క్రీడాకారుల చిరకాల వాంఛ మినీ స్టేడియం నిర్మాణానికి అడుగు ముందుకు పడింది. 2022లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. స్టేడియాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దేలా రూ.10 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ మేరకు స్టేడియంలో రాళ్లను తొలగించి మట్టి పోసి చదును చేశారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా స్టేడియం ఏర్పాటు కల నిజమవుతున్న తరుణంలో ప్రభుత్వాలు మారడంతో పనులు నిర్వహణలో జాప్యం ఏర్పడింది.

మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

మినీ స్టేడియం పేరుతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం స్థానిక నాయకులు శివాజీ స్టేడియంగా పేరు మార్చి ఇటీవల బోర్డును ఏర్పాటు చేశారు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో క్రీడాకారుల్లో నైరాశ్యం నెలకొంది. తమ చిరకాల కోరిక కలగానే మిగిలిపోయిందని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారడంతో నిధుల కొరత ఏర్పడి పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఉన్నారు. స్టేడియం పనులు ఆగిపోవడంతో క్రీడాకారులు మండిపడుతున్నారు. స్టేడియం నిర్మాణంపై రాజకీయాలు వద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వచ్ఛందంగా పిచ్ ఏర్పాటు

పట్టణానికి చెందిన క్రీడాకారులు తమ సొంత నిధులను పోగుచేసుకొని స్టేడియంలో క్రికెట్ పిచ్‌ను నిర్మించుకున్నారు. క్రికెట్ అంటే ఆసక్తి గల క్రీడాకారులు మండలంలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఓవైపు ఐపీఎల్ తరహా పోటీలను వీక్షిస్తున్న క్రీడాకారులు అదే తరహాలో అసంపూర్తిగా నిర్మించిన స్టేడియంలో తరచూ పోటీలను నిర్వహించుకుంటూ తమ క్రీడా ఆసక్తిని చాటుతున్నారు. ముఖ్యంగా స్థానిక నాయకుల సహకారంతో క్రికెట్ టోర్నీల్లో పాల్గొంటూ క్రీడాస్ఫూర్తిని చాటుతున్నారు. గెలిచిన విజేతలకు నగదు పారితోషకాలతో పాటు ఐపీఎల్ తరహాలో ట్రోఫీలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

నిర్మాణం చూసి మురిసిపోయా...



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన స్టేడియం నిర్మాణం ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే మూలాన పడింది. స్టేడియం చదును పనులు చూసి ఎంతో ముచ్చట పడ్డాను. అన్ని హంగులతో చూస్తాననుకున్న.. పనులు ఆగిపోవడంతో ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.

-పవన్, క్రీడాకారుడు

గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పటాన్‌చెరు: తొలిమలి దశ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప గాంధేయవాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాపూజీ కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాల పాటు అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ అని కొనియాడారు. జాతికి వారు చేసిన సేవలను భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో పటాన్‌చెరులో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అదృష్టం తనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, సీనయ్య, వెంకటేశ్, రుద్రారం శంకర్, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి రఘురాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డపోతారం పట్టణ పరిధిలో..

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని మాదారంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో యువజన వికాస్ సమితి ప్రధాన కార్యదర్శి విజయ్‌గౌడ్, మల్లేశ్, రమణ, గణేశ్, చంద్రశేఖర్ మహేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఎన్నికల్లో అవకతవకలు

నర్సాపూర్: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి పాస్టరేట్ కమిటీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పలువురు చర్చి సభ్యులు ఆదివారం నిరసనకు దిగారు. పాస్టరేట్ కమిటీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్‌తో పాటు చర్చి సభ్యులు ప్రభాకర్, నవీన్, జయప్రకాష్, కిరణ్ పలువురు చర్చి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 13న చర్చి పాస్టరేట్ కమిటీ ఎన్నికలు జరిగాయని, ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో కొంతమంది అభ్యర్థులు నిబంధనలు ఉల్లంఘించి సభ్యులను మభ్యపెట్టారని ఆరోపించారు. అంతేగాక చర్చి ఫాదర్, ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జి రెవరెండ్ సందీప్ కుమార్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి కొంతమందికి అనుకూలంగా ప్రచారం చేశారని రాజ్‌కుమార్, ప్రభాకర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై చర్చి ఫాదర్, ప్రెస్‌బైటర్ ఇన్‌చార్జ్ సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా చర్చి నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించామని, ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు.

కుట్టుమెషీన్ల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ హిమజ అన్నారు. మండల పరిధి మగ్దుంపూర్‌లో బేతని సంరక్షణ నిలయంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 20 మంది హెచ్ఐవీ బాధితులకు కుట్టుమెషీన్ల పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు అండగా ఉంటామన్నారు. ఇందులో భాగంగానే ఉచితంగా 3 నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎపిక్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సాయంతో కుట్టు మిషన్లను అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా మార్కెట్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బేతని ఆశ్రమ నిర్వాహకుడు సజీవ్ వర్గీస్, ఫాదర్ సెబాస్టియన్, సిబ్బంది కర్మెల, విన్సెంట్, వీరబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.


కుట్టుమెషీన్ల అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దీక్షలతో మనశ్శాంతి, భక్తి భావన


భోగ్‌భండార్‌ను నిర్వహిస్తున్న శేఖర్‌మహారాజ్ తదితరులు

వట్‌పల్లి(అందోల్): భవానీ దీక్షలు చేపట్టడం వల్ల భక్తి భావన, మనశ్శాంతి లభిస్తుందని పౌరాదేవి పీఠాధిపతి శేఖర్ మహరాజ్ అన్నారు. అందోల్ మండలం కొండారెడ్డిపల్లి తండాలో భవానీ దీక్ష చేపట్టిన స్వాములు నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. దీక్షను నియమనిష్టలతో చెడు అలవాట్లకు దూరంగా ఉండి దీక్షలు చేయడం వల్ల గిరిజనుల్లో మార్పు వస్తుందన్నారు. విఠల్ మహరాజ్ మాట్లాడుతూ.. భవానీ దీక్షలు చేపట్టడం వల్ల భక్తి పెరుగుతుందన్నారు. మనమంతా ఒక్కటేనన్న భావన కలుగుతుందని తెలిపారు. భవానీ ఆలయం వద్ద భోగ్ భండార్ నిర్వహించి ఆలయంలో పూజలు నిర్వహించారు. దీక్షలు చేపట్టిన స్వాములు శేఖర్ మహరాజ్, విఠల్ మహరాజ్‌ల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఆటోలకు అడ్డాగా బస్టాండ్..


బస్టాండ్ వద్ద నిలిపిన ఆటోలు

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ ప్రధాన ద్వారం ఆటోలకు అడ్డాగా మారింది. బస్టాండ్ ఆవరణలో ఆటోలు తిష్ట వేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ప్రధాన బస్టాండ్ కావడంతో ప్రతి నిత్యం వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణాలు ఇక్కడి నుంచే కొనసాగిస్తుంటారు. బస్టాప్ ప్రయాణికుల కోసమా లేక ఆటోల కోసమా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తరచుగా ఆటోలు ప్రధాన రోడ్లపై నిలపడంతో గంటల కొద్ది ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో వెనకనుంచి వస్తున్న వాహనాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి ఆటోలను బస్టాండ్‌కు దూరంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ యార్డు దుర్గంధం


చెత్తతో నిండిన మార్కెట్ యార్డు

జహీరాబాద్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మార్కెట్ కార్యాలయానికి పక్కన ఉన్న ఖాళీ ప్రదేశం పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు చెత్తతో కూడిన కవర్లను పారవేస్తుండటంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్ యార్డుకు ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. యార్డులో చెత్తను వేస్తుండటంతో మేకలు, పశువులు అక్కడకు చేరి చిందరవందర చేస్తున్నాయి. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. యార్డులో చెత్తను వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు


ముమ్మాదేవి విగ్రహం


జహీరాబాద్ ఉత్సవాలకు ముస్తాబయిన ఆలయం

రాయికోడ్(అందోల్): రాయికోడ్ లోని ముమ్మాదేవి ఆలయంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వచ్చే నెల 2 వరకు కొనసాగే వేడుకల్లో నిత్యం అమ్మవారిని వివిధ రూపాల్లో భక్తులు దర్శించుకోనున్నారు. భజనలు, ఆధ్యాత్మిక గురువుల ప్రవచనాల కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

తుల్జాభవానీ మాత ఆలయంలో..

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లె గ్రామంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. ఆలయానికి వచ్చే భక్తులు చిరాగ్‌పల్లి నుంచి, గోపన్‌పల్లి, మన్నాపూర్ గ్రామాల రహదారుల నుంచి చేరుకోవచ్చని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జోరుగా మాంసం విక్రయాలు


జోగిపేట(అందోల్): మార్కెట్‌లో మాంసం కొనేందుకు వచ్చిన జనం

జోగిపేట(అందోల్): పెద్దల అమావాస్య సందర్భంగా జోగిపేటలో ఆదివారం మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. మాంసం విక్రయాలతో మార్కెట్ కిటకిటలాడింది. 500కు పైగా మేక, గొర్రె పొట్టేళ్లను కోసి విక్రయించినట్లుగా వ్యాపారస్తులు తెలిపారు. అందోల్ మండలంలోని చుట్టు పక్క గ్రామాల ప్రజలు సైతం జోగిపేటకు వచ్చి కొనుగోలు చేశారు. ఉ.4 గంటల నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. పెద్దల అమావాస్య రోజున చనిపోయిన వారికి నైవేద్యం పెట్టడం ఆనవాయితీ.

కిటకిటలాడిన దుకాణాలు

సదాశివపేట(సంగారెడ్డి): పెద్దరామాస పండుగ సందర్భంగా ఆదివారం ప్రజలు పెద్దలకు ఇష్టమైన మాంసం ఇతర పదార్థాలు వండి నైవేద్యం పెట్టి వారిని స్మరించారు. పట్టణంలోని సిద్దాపూర్‌గొని, మటన్ మార్కెట్, చికెన్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.


మటన్ దుకాణాల వద్ద గుమికూడిన ప్రజలు

రోడ్లపై పశువుల సంచారం

- వీధుల్లోకి వదిలేస్తున్న యజమానులు
- ప్రమాదాల బారిన వాహనదారులు


జహీరాబాద్ పట్టణ రోడ్డుపై తిరుగుతున్న పశువులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఎక్కడ చూసినా మూగజీవాల మందలే కనిపిస్తున్నాయి. యజమానులు రోడ్లపైకి వదిలేయడంతో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు చౌరస్తాలు పశువులు సంచారానికి అడ్డాలుగా మారాయి. రోడ్లపైనే తిష్ట వేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయా కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలో రద్దీగా ఉండే మెయిన్ రోడ్డుపై పశువులు సంచరిస్తున్నాయి. మూగజీవాలు తిరగడం, రోడ్లపై పడుకోవడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువుల యజమానాలు వీధులోకి వదిలేయడం వల్ల పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపైనే తిరుగుతున్నాయి. వాహనచోదకులు హారన్ కొట్టిన పక్కకు జరగడం లేదు. ప్రజలకు ఆటంకం కల్గిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాల్లో మూగజీవాలు చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయి. అధికారులు స్పందించి పశువులను రోడ్డుపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్లపై వదిలేసిన పశువులను గోశాలకు తరలించాలని కోరుతున్నారు.

వదలని వర్షం.. ఇంకెన్నాళ్లో కష్టం


పత్తి చేలో నిలిచిన వర్షపు నీరు

రాయికోడ్(అందోల్): వరుసగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులు పత్తి చేలల్లో నిలిచిన నీటిని బయటకు పంపేందుకు శ్రమిస్తుంటే నిత్యం సాయంత్రం వేళల్లో వర్షం కురుస్తోంది. వర్షాలతో ఇంకెన్నాళ్లో కష్టమంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి చేలల్లో వర్షపు నీరు మరింత చేరింది. పొడి వాతావరణం లేకపోవడంతో మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదగడం లేదు. ఓ వైపు పంట పొలాల్లో వరద నీరు, బురదమయం కావడంతో రైతులు పంట సంరక్షణకు నానాఅవస్థలు పడుతున్నారు. వర్షాలు నిలిచిపోవాలని అన్నదాతలు వరుణ దేవుడిని వేడుకుంటున్నారు. మండలంలో 33 వేల ఎకరాల్లో పత్తిసాగు చేయగా ఎకరాకు 3, 4 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేలా లేదని రైతులు వాపోయారు. 200 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నదంతో పరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఏఓ సారిక తెలిపారు.

ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

కార్పొరేటర్ సింధు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కార్పొరేటర్ సింధు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొని స్థానిక మహిళలతో కలిసి ఆడిపాడారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గ్రామీణ రోడ్లు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. హత్నూర నుంచి పన్యాల, బడంపేట, మాధుర, వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా పాడైయింది. నవాబుపేట, బ్రాహ్మణగూడ, కొత్తగూడెం, నాగోల్దేవులపల్లి, కోనంపేట, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసే సమయంలో గుంతల్లో నీళ్లు నిండి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లను మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.


హత్నూర ప్రధాన రహదారి దుస్థితి